క్లుప్తంగా

26న చిన్నారుల హృద్రోగ వైద్య శిబిరం

భీమవరం (ప్రకాశంచౌక్): మెంటేవారి తోటలోని అల్లూరి సీతారామరాజు భగత్‌సింగ్ వైద్య సహాయ కేంద్రంలో మంగళవారం ఉదయం పిల్లల గుండె సంబంధిత వ్యాధులకు ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు వసుధ ఫౌండేషన్ కన్వీనర్ ఇందుకూరి ప్రసాదరాజు ఆదివారం తెలిపారు. విజయవాడకు చెందిన పిల్లల గుండె వైద్య నిపుణులు డాక్టర్ కె.విక్రమ్ (ఇంటర్ వెన్షనల్ పీడియాట్రిక్ కార్డియాలజిస్ట్) పిల్లలను పరిశీలించి అవసరమైన వారికి పరీక్షలు నిర్వహిస్తారన్నారు. 15 సంవత్సరాల లోపు వయసు గల చిన్నారులకు మెడికల్ క్యాంపులో ఉచిత పరీక్షలు, చికిత్సకు వైద్య సహాయం అందిస్తారని తెలిపారు. వైద్య శిబిరాన్ని భీమవరం, భీమవరం చుట్టు పక్కల ప్రాంతాల వారు వినియోగించుకోవలసిందిగా కోరారు. వసుధ ఫౌండేషన్, ఎస్ఎల్‌జీ హాస్పిటల్స్, మానవతా తదితర స్వచ్ఛంద సంస్థలు ఈ కార్యక్రమంలో పాల్గొని వైద్య సహాయం అందిస్తాయన్నారు. ఇతర సమాచారం కోసం 99490 93115, 94408 59700 , 63001 80993, 94943 38086 నంబర్లకు ఫోన్ చేసి తెలుసుకోవచ్చన్నారు.

బీచ్‌లో సందర్శకుల సందడి



కేపీ పాలెం బీచ్‌లో సేదతీరుతున్న సందర్శకులు

మొగల్తూరు: కేపీ పాలెం బీచ్‌కు ఆదివారం పర్యాటకులు భారీగా తరలివచ్చారు. ఉదయం నుంచి ఎండతో పాటు ఉక్కబోతగా ఉండటంతో పర్యాటకులు సముద్ర స్నానం చేస్తూ ఉత్సాహంగా గడిపారు. అనంతరం తీరంలోని వేంకటేశ్వరస్వామి, వేలాంకణీ మాత, పాండరంగ స్వామి, 54 అడుగుల అభయాంజనేయ స్వామి, షిర్డీ సాయిబాబా, అష్టలక్ష్మీ అమ్మవారి ఆలయాలను దర్శించుకున్నారు.

దూరవిద్య ప్రవేశాలకు గడువు పెంపు

మొగల్తూరు: ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక విద్యా పీఠం ద్వారా పదో తరగతి, ఇంటర్మీడియట్ చేరాలనుకునే వారికి ఫీజు గడువును ఈ నెల 30వ తేదీ వరకు పొడిగించినట్లు విద్యాపీఠం మండల కోఆర్డినేటర్, స్థానిక ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు వర్ధమాని రవి శంకర సర్కార్ తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఓ ప్రకటన విడుదల చేశారు. పదో తరగతిలో చేరేందుకు ఎటువంటి విద్యార్హత లేదని 14 సంవత్సరాలు వయస్సు దాటి ఉండాలని, ఇంటర్మీడియట్ చేరే వారు పదోతరగతి ఉత్తీర్ణులై ఉండాలని పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు వారి సచివాలయంలోని విద్యా సంక్షేమ సహాయకులను సంప్రదించాలని కోరారు.

మానవత సంస్థ ఆర్థిక సహాయం



పేద విద్యార్థులకు ఆర్థిక సహాయం అందజేస్తున్న మానవత సంస్థ సభ్యులు

పెనుమంట్ర: విద్యార్థుల మానసిక, శారీరక ఆరోగ్యాన్ని పెంపొందించడంలో మానవత చేస్తున్న ప్రోత్సాహం మరువలేనిదని కుంగ్‌ఫూ మాస్టర్ అరటికట్ల శ్రీనివాస ప్రభు అన్నారు. మానవత సంస్థ నెలవారీ సమావేశం జిల్లా అధ్యక్షులు బాణాల శ్రీనివాసరావు అధ్యక్షతన మార్టేరు మానవతా కార్యాలయంలో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా పేద విద్యార్థులు కె.రాజేష్, ఎలమర్తి దీపక్‌లకు రూ. 5 వేలు చొప్పున ఆర్థిక సహాయం అందజేశారు. ప్రత్యేక అతిథి జెడ్పీటీసీ సభ్యురాలు కర్రి గౌరీ సుభాషిణి వేణుబాబు మాట్లాడుతూ ఇతరలకు మనల్ని ఆదర్శంగా చూపించేది మన గెలుపు అయితే దైవంగా చూపించేది సేవ మాత్రమే అని పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు చిర్ల చినసూర్యనారాయణరెడ్డి, సూర్యతేజ, సత్తి సత్యనారాయణ రెడ్డి, సెక్రటరీ బండి ప్రసాద్, వైస్ ప్రెసిడెంట్ కర్రి కృష్ణారెడ్డి, చిర్ల శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

సామూహిక సరస్వతీ పూజలు



పూజలు నిర్వహిస్తున్న మహిళలు

తాడేపల్లిగూడెం రూరల్: కడియద్దలో శ్రీలక్ష్మీ గణపతి ఆలయం వద్ద వినాయక చవితి ఉత్సవాలను పురస్కరించుకుని ఆదివారం సామూహిక సరస్వతీ పూజలు నిర్వహించారు. సుమారు 300 మంది చిన్నారులు ఈ పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఆలయ అర్చకులు పావులూరి విశ్వనాథశాస్త్రి, రమేష్ బ్రహ్మత్వంలో సరస్వతీ పూజలు జరిగాయి. ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

సచివాలయాలతో ప్రజల ముంగిటకే పాలన

- రాజ్యసభ సభ్యులు పి.సుభాష్‌చంద్రబోస్, మంత్రి కారుమూరి, జెడ్పీ ఛైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ, డీసీసీబీ ఛైర్మన్ పీవీఎల్
- మహదేవపట్నంలో సచివాలయాలు, ఆర్బీకేలు ప్రారంభం



మహదేవపట్నంలో సచివాలయాలు, ఆర్బీకేల ప్రారంభంలో పాల్గొన్న రాజ్యసభ సభ్యులు పిల్లి సుభాష్‌చంద్రబోస్, మంత్రి కారుమూరి, జెడ్పీ ఛైర్‌పర్సన్ పద్మశ్రీ, డీసీసీబీ ఛైర్మన్ పీవీఎల్

ఆకివీడు: ఉండి మండలంలోని మహాదేవపట్నంలో సచివాలయం-1, -2 భవనాలను, రెండు ఆర్బీకే భవనాలను రాజ్యసభ సభ్యులు పిల్లి సుభాస్‌చంద్ర బోస్, రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు, జెడ్పీ ఛైర్మన్ ఘంటా పద్మశ్రీ, డీసీసీబీ ఛైర్మన్ పీవీఎల్ నర్సింహ రాజు, నియోజకవర్గ పార్టీ పరిశీలకురాలు పిల్లంగోళ్ల శ్రీలక్ష్మీ, చినమిల్లి వెంకట రాయుడు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామాల్లో సచివాలయ వ్యవస్థ ద్వారా పరిపాలనను ప్రజల ముంగిటకు తీసుకువచ్చిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని చెప్పారు. ప్రజలు మండల కేంద్రాలకు వెళ్లాల్సిన అవసరం లేదన్నారు. రైతులు, గ్రామీణ ప్రజలు ఆసుపత్రులకు, రైతు అవసరాలను పల్లెల్లోనే తీర్చుకునే విధంగా అన్ని ఏర్పాట్లు చేశారని చెప్పారు. రైతులకు సబ్సిడీలపై పనిముట్లు, రోగులకు ఉచితంగా పరీక్షలు, మందులు అందుబాటులో ఉంటున్నాయన్నారు. సచివాలయ వ్యవస్థ ద్వారా పరిపాలన పల్లెల్లోనే కొనసాగుతోందన్నారు. 75 ఏళ్ల స్వాతంత్ర్యంలో పల్లెలు ఎక్కడ వేసిన గొంగళి అక్కడనే అన్న చందంగా ఉంటే, జగన్ ప్రభుత్వంలో పల్లెలు ప్రగతిపథంలో నడుస్తున్నాయని చెప్పారు. అధికారులు, సిబ్బంది ప్రజల వద్దకు వచ్చి వారి సమస్యల్ని పరిష్కరిస్తున్నారని చెప్పారు. గత ప్రభుత్వాల పాలనలో పంచాయతీలకు భవనాలు లేక అద్దె ఇళ్లల్లో గడిపేవారన్నారు. పంచాయతీ కార్యాలయాల్లో సిబ్బంది ఉండేవారు కాదని, గ్రామ సింహాలే అక్కడ నిద్రపోయేవని ఎద్దేవా చేశారు. గ్రామ సచివాలయాలు సిబ్బందితో, ప్రజలతో సందడిగా ఉన్నాయని చెప్పారు. కార్యక్రమంలో గ్రామ ఉపసర్పంచ్ ముందునూరి సుబ్బరాజు, ఎంపీపీ ఇందుకూరి శ్రీహరి నారాయణరాజు, జెడ్పీటీసీ సభ్యులు రణస్థల కనక దుర్గ, ఏఎంసీ ఛైర్మన్ బి.వెంకటేశ్వర్లు, వైస్ ఛైర్మన్ చేకూరి రాజా నరేంద్ర కుమార్‌వర్మ, వైఎస్సార్ సీపీ నాయకులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

నేడు ఆలయ పాలకవర్గం ప్రమాణస్వీకారం

ఆకివీడు: స్థానిక మాణిక్యాంబ సమేత భీమేశ్వర స్వామి ఆలయ కొత్త పాలకవర్గం సోమవారం ఉదయం 9 గంటలకు ప్రమాణ స్వీకారం చేయనున్నారు. ఈ కార్యక్రమానికి డీసీసీబీ ఛైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు ముఖ్యఅతిథిగా పాల్గొనన్నారు. అనంతరం చినకాపవరంలో వైఎస్సార్ కాపు నేస్తం సంబరాల్లో పీవీఎల్ పాల్గొంటారని పెదమిరంలోని పార్టీ కార్యాలయం ఆదివారం ఒక ప్రకటనలో తెలిపింది.

ఆధ్యాత్మిక చింతన పెరగాలి

వీరవాసరం: సమాజంలో ని ప్రతి ఒక్క రూ ఆధ్యాత్మిక భావనలను పెంపొందించుకోవాలని భీమవరం ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ తనయుడు గ్రంధి రవితేజ అన్నారు. వీరవాసరంలో ఏర్పా టు చేసిన వినాయక మండపాలను ఆదివారం సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వినాయకుని ఆశీస్సులు ప్రతి ఒక్కరిపై ఉండాలని ఆకాంక్షించారు. వినాయక ఉత్సవ కమిటీ సభ్యులు గ్రంధి రవితేజను శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో నూకల కనకారావు, మతల కాశి, కందుల సురేష్ పాల్గొన్నారు.

ఆలయాల అభివృద్ధికి పటిష్ట చర్యలు



ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన ఈఓ రామకృష్ణంరాజు

సాక్షి, భీమవరం: భీమవరం నియోజవర్గంలోని ఆలయాల అభివృద్ధికి పటిష్ట చర్యలు తీసుకున్నామని ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ అన్నారు. పంచారామ క్షేత్రాల్లో ఒకటైన గునుపూడి శ్రీఉమాసోమేశ్వర జనార్దనస్వామి వారి దేవస్థానం ఇన్ చార్జి ఈఓగా నియమితులైన డి.రామకృష్ణంరాజు ఆదివారం సాయంత్రం స్థానిక క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ మాట్లాడుతూ భక్తులకు ఆలయంలో ఆధ్యాత్మికతను కల్పించడంతోపాటు స్వామి, అమ్మవారి దర్శనం ప్రశాంత వాతావరణంలో కల్పించాలని ఆదేశించారు. కాగా ఇప్పటివరకు ఈ ఆలయంలో ఈవోగా పనిచేసిన చాగంటి సురేష్ నాయుడు నరసాపురం గ్రూపు దేవస్థానాలకు బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో మొగల్తూరు మండలం ముత్యాలపల్లి బండి ముత్యాలమ్మ అమ్మవారి దేవస్థానం ఇఓగా పనిచేస్తున్న డి.రామకృష్ణంరాజును ఇక్కడకు బదిలీపై వచ్చారు.

కాఫీ క్లబ్ సేవలు అభినందనీయం



కాఫీ క్లబ్ డైరెక్టరీని ఆవిష్కరిస్తున్న సినీ నిర్మాత నర్సింహరావు

సాక్షి, భీమవరం: మిత్రులందరితో క్లబ్ ఏర్పాటు చేసుకోవడంతోపాటు ఒక పుస్తకాన్ని ఆవిష్కరించడం గొప్ప విశేషమని ప్రముఖ సినీ నిర్మాత, రాశీ మూవీస్ అధినేత ఎం.నర్సింహారావు అన్నారు. భీమవరంలో ఆదివారం మార్నింగ్ కాఫీ క్లబ్ డైరెక్టరీని ఆవిష్కరించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. క్లబ్‌లు ఐకమత్యంతోనే ఉండాలని, మార్నింగ్ కాఫీ క్లబ్ చేస్తున్న సేవా కార్యక్రమాలు అభినందనీయమన్నారు. క్లబ్ ఫౌండర్ అండ్ కన్వీనర్ బొండా రాంబాబు, కో- ఎడిటర్ కనగర్ల విజయ రామకృష్ణ, కారుమూరి సత్యనారాయణ మూర్తి, భట్టిప్రోలు శ్రీనివాసరావు మాట్లాడుతూ రెండేళ్ల క్రితం 20 మందితో క్లబ్‌ను ఏర్పాటు చేశామని, క్లబ్ ద్వారా అనేక సేవా కార్యక్రమాలు, సేవాతత్పరులకు సత్కార కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. ఈ సందర్భంగా సినీ నిర్మాత నర్సింహారావును సత్కరించారు. కార్యక్రమంలో కొత్త శ్రీనివాస్, కురిశెటి నాని, కోట్ల నాని, బొండా హనుమంతరావు, పరుచూరి నాగేశ్వరరావు, బొండాడ బంగార్రాజు పాల్గొన్నారు.

కంతేటి వెంకట్రాజుకు ప్రముఖుల పరామర్శ



కంతేటి వెంకట్రాజును పరామర్శిస్తున్న ఎమ్మెల్యే రంగనాథరాజు, మాజీ ఎంపీ బాపిరాజు తదితరులు

భీమవరం (ప్రకాశంచౌక్): అల్లూరి సీతారామరాజు యువజన సంఘాల అధ్యక్షుడు, భీమవరం హౌసింగ్ బోర్డు శ్రీవెంకటేశ్వరస్వామి దేవస్థాన ఛైర్మన్ కంతేటి వెంకట్రాజు తల్లి కంతేటి సత్యవతమ్మ ఇటీవల కాలం చేశారు. ఈ మేరకు ఆదివారం ఆదివారం మాజీ మంత్రి, ఎమ్మెల్యే చెరుకువాడ శ్రీరంగనాథ రాజు, మాజీ ఎంపీ కనుమూరి బాపిరాజు, క్షత్రియ కార్పొరేషన్ పెద్దలు సత్యవతమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించి కంతేటి కుటుంబానికి సానుభూతి తెలియజేశారు. ఈ సందర్భంగా రంగనాథరాజు, బాపిరాజు మాట్లాడుతూ కంతేటి సత్యవతి ఆధ్యాత్మిక కార్యక్రమాలకు తన వంతు సహాయ సహకారాలను అందించేవారన్నారు. అలాగే వెంకటేశ్వరస్వామి వారి దేవస్థానానికి సహాయ సహకారాలు అందించి మన్నలను పొందారన్నారు. ఆమె ఆత్మకు శాంతి చేకూరాలన్నారు.

సీపీఎం నేత కొరటాలకు నివాళి



భీమవరంలో సీపీఎం నేత కొరటాల చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పిస్తున్న దృశ్యం

సాక్షి, భీమవరం: కమ్యూనిస్టు ఉద్యమ నాయకుడు కొరటాల సత్యనారాయణ శతజయంతిని ఆదివారం పట్టణంలోని సీపీఎం కార్యాలయంలో నిర్వహించారు. తొలుత కొరటాల చిత్రపటానికి జిల్లా కార్యదర్శి బి.బలరామ్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గుంటూరు జిల్లాలో జన్మించిన సత్యనారాయణ బాల్యం నుంచి దేశభక్తి భావాలను అలవర్చుకుని విద్యార్థి దశలోనే స్వాతంత్ర్యోద్యమంలో పాల్గొన్నారన్నారు. చదువు మధ్యలోనే ఆపేసి తన జీవితాన్ని ప్రజాపోరాటాలకు అంకితం చేశారన్నారు. ఆంధ్ర రాష్ట్రంలో రైతాంగ ఉద్యమం, చేనేత కార్మికుల సమస్యల పరిష్కారం కోసం రేపల్లెలో చేనేత కార్మిక సంఘాన్ని నిర్మించి వారి సమస్యలపై విశేష కృషి చేశారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు జేఎన్‌వీ గోపాలన్, జిల్లా కమిటీ సభ్యుడు ఎం.వైకుంఠరావు పాల్గొన్నారు.

నేడు వినియోగదారుల సమావేశం

పాలకొల్లు సెంట్రల్: వినియోగదారుల సమస్యలపై సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు వినియోగదారుల సంఘం మండల ప్రధాన కార్యదర్శి ముచ్చర్ల వీరాస్వామి నాయుడు తెలిపారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర వినియోగదారుల మంత్రిత్వ శాఖ, పౌర సరఫరాల శాఖ ఆదేశానుసారం సోమవారం ఉదయం 11 గంటలకు పట్టణంలో వీరావారి వీధిలో వినియోగదారుల మండలి కార్యాలయంలో సమావేశం నిర్వహించనున్నట్లు తెలిపారు. సభ్యులందరూ ఈ సమావేశానికి హాజరుకావాలని కోరారు.

ఉండి తరలిన వైఎస్సార్ సీపీ శ్రేణులు



గొల్లలకోడేరులో నరేంద్రరాజును పుష్పగుచ్ఛాలు అందిస్తున్న ఎంపీపీ చంటి రాజు, నాయకులు

పాలకోడేరు: ఉండిలో ఆదివారం నిర్వహించే ఏఎంసీ పాలకవర్గ ప్రమాణ స్వీకారోత్సవం కార్యక్రమానికి మండలం నుంచి వైఎస్సార్ సీపీ శ్రేణులు తరలివెళ్లారు. ఏఎంసీ వైస్ ఛైర్మన్‌గా గొల్లలకోడేరుకు చెందిన వైఎస్సార్ సీపీ నాయకుడు చేకూరి రాజా నరేంద్రకుమార్, కోరుకొల్లుకు చెందిన గుండు నాగేశ్వరరావు డైరెక్టర్‌గా నియమితులయ్యారు. ఈ నేపథ్యంలో ఎంపీపీ భూపతిరాజు చంటి రాజు ఆధ్వర్యంలో మండలంలోని నాయకులు, కార్యకర్తలు అభిమానులు పెద్ద ఎత్తున ర్యాలీగా బయలుదేరి వెళ్లారు. తొలుత మండలంలోని నాయకులు, కార్యకర్తలు, అభిమానులు గొల్లలకోడేరులో నరేంద్రకుమార్ నివాసానికి వెళ్లి ఆయనకు బొకేలు ఇచ్చి శుభాకాంక్షలు తెలిపి శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా చేకూరి నరేంద్రరాజు, గుండు నాగేశ్వరరావు మాట్లాడుతూ పార్టీలో కష్టపడి పనిచేసే వారికి పదవులు వరిస్తాయనడానికి తామే నిదర్శనం అన్నారు. ముఖ్యమంత్రి జగనన్న పాలనలో ప్రజలంతా సుఖసంతోషాలతో ఉన్నారని, వచ్చే ఎన్నికల్లో జగనన్నను మళ్లీ ముఖ్యమంత్రి చేయడానికి సిద్ధంగా ఉన్నారని అన్నారు. డీసీసీబీ ఛైర్మన్ పీవీఎల్ నర్సింహరాజుకు కృతజ్ఞతలు తెలిపి పదవులకు న్యాయం చేస్తామన్నారు. రైతులకు సేవలు అందించడంలో తన వంతు కృషి చేస్తామన్నారు. ఎంపీపీ భూపతిరాజు చంటి రాజు, సర్పంచుల ఛాంబర్ మండల అధ్యక్షులు భూపతిరాజు వంశీకృష్ణంరాజు, కొత్తపల్లి కాశీ విశ్వనాథరాజు, కునాథరాజు కృష్ణంరాజు, దెందుకూరి వెంకటరాజు, బొక్కా రాంబాబు, గరగపర్రు అబ్బులు, పాలా రాధాకృష్ణ కడిమి కుమార్, చెల్లబోయిన పాపారావు, శివకోడు హనుమంతరావు, బ్యాంకు నరసింహరాజు, సర్పంచులు బొల్లా శ్రీనివాస్, కడలి నాగేశ్వరి, ఇంజేటి మరియమ్మ, చింతపల్లి వెంకటనారాయణ, వైస్ ఎంపీపీ ఆదాడ లక్ష్మి తులసి, నరేష్ పాల్గొన్నారు.

రైతులకు మెరుగైన సేవలందిస్తా



గొల్లలకోడేరులో కేక్ కట్ చేస్తున్న గ్రామస్తులు

పాలకోడేరు: రైతులకు మెరుగైన సేవలందించేందుకు కృషి చేస్తానని ఉండి ఏఎంసీ వైస్ ఛైర్మన్ రాజా నరేంద్రకుమార్ అన్నారు. ఉండి ఏఎంసీ వైస్ ఛైర్మన్‌గా ప్రమాణ స్వీకారం అనంతరం గ్రామానికి వచ్చిన సందర్భంగా గొల్లలకోడేరులో పార్టీ నాయకులు, కార్యకర్తలకు ఆయనకు ఘనస్వాగతం పలికి సంబరాలు చేశారు. ఈ సందర్భంగా నరేంద్రకుమార్ మాట్లాడుతూ తనను నమ్మి ఇచ్చిన బాధ్యతలను అప్పగించిన డీసీసీబీ ఛైర్మన్ పీవీఎల్ నర్సింహరాజుకు జీవితాంతం రుణపడి ఉంటానన్నారు. తన రాజకీయ జీవితంలో గ్రామస్తులు అందిస్తున్న సహకారం మరువలేనిది అన్నారు. రాబోయే రోజుల్లో పార్టీ అభివృద్ధికి, గెలుపునకు శక్తివంచన లేకుండా కృషి చేస్తానని చెప్పారు. గ్రామంలోని క్రిస్టియన్ ఏరియాల ప్రాంత ప్రజల ఆధ్వర్యంలో బాణసంచా కాల్చి నరేంద్రకుమార్‌కు స్వాగతం పలికారు. పుష్పగుచ్ఛాలు, శాలువలతో ఆయనను క్రిస్టియన్ పేట పెద్దలు, యూత్, మహిళలు సత్కరించారు. మెయిన్ సెంటర్లో ఏర్పాటు చేసిన కేక్‌ను నరేంద్ర కుమార్ కట్ చేసి అందరికీ పంచారు. జీవీ నరసింహరావు, బాబూరావు, సాలోమోను, నేతల సాల్మన్, చంద్రశేఖర్, రాజశేఖర్, సత్యనారాయణ, గాంధీ, పవన్, దీపు, నరేష్, రవి, వెంకటరాజు, బన్ను పాల్గొన్నారు.

చురుగ్గా జగనన్న ఆరోగ్య సురక్ష



కాళింగగూడెం పుంతగట్టులో వృద్ధురాలికి వైద్య పరీక్షలు చేస్తున్న ఏఎన్ఎం ఘంటా విజయలక్ష్మి



కాళింగగూడెంలో ఓ ఇంట వృద్ధుడు తంగి సత్యనారాయణకు వైద్య పరీక్షలు చేస్తున్న సిబ్బంది

ఆకివీడు: మండలంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం చురుగ్గా సాగుతోంది. ఆదివారం మండలంలోని కాళింగగూడెంలో వైద్య సిబ్బంది ఇంటింటికీ వెళ్లి కుటుంబ సభ్యులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహిస్తున్నారు. గ్రామంలో 72 ఏళ్ల వృద్ధురాలు బొడ్డుపల్లి నారాయణమ్మకు పరీక్షలు చేశారు. అన్నీ నార్మల్‌గా ఉండటంతో ఆమెకు బలానికి మందులు ఇచ్చారు. పొలినాటి వెలమ కార్పొరేషన్ డైరెక్టర్ తంగి పుష్కరరావు తండ్రి 68 ఏళ్ల సత్యనారాయణకు వైద్య పరీక్షలు చేశారు. హిమోగ్లోబిన్, బీపీ, సుగర్ అన్నీ నార్మల్‌గా ఉండటంతో ఈయన కూడా బలానికి మందులు తీసుకున్నారు. గ్రామంలో ఆదివారం ఒక్కరోజే 68 గృహాలకు వెళ్లి 230 మందికి వైద్య పరీక్షలు నిర్వహించినట్లు ఏఎన్ఎం ఘంటా విజయలక్ష్మీ చెప్పారు. ప్రతీ ఇంటికి వెళ్లి ఆరోగ్య వివరాలు తెలుసుకుని పరీక్షలు చేశామని చెప్పారు. ఇద్దరు పక్షవాత రోగులకు మందులు అందుతున్న తీరును పరిశీలించామన్నారు. కార్యక్రమంలో ఆశా వర్కరు ఎ.దమయంతి, వలంటీర్ ధనలక్ష్మీ సహకరించారని ఏఎన్ఎం చెప్పారు.

చిత్రకళ పోటీల్లో విజేతలకు బహుమతులు



విజేతలకు బహుమతులు అందజేస్తున్న దృశ్యం

సాక్షి, భీమవరం: డిజిటల్ యుగంలో కూడా చిత్రకళకు ప్రాధాన్యత తగ్గలేదని, మంచి చిత్రకారులకు ఎల్లప్పుడు ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని భీమవరం అంకాల ఆర్ట్స్ అకాడమీ అధ్యక్షుడు గ్రంధి వెంకట్రావు అన్నారు. ఆదివారం అకాడమీ ఆర్ట్ స్కూల్లో విద్యార్థులకు నిర్వహించిన చిత్రకళా పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేసిన సందర్భంగా ఆయన మాట్లాడారు. అకాడమీ కార్యదర్శి కాగిత వెంకటరమణ మాట్లాడుతూ ప్రతి ఆదివారం అకాడమీ నిర్వహిస్తున్న ఉచిత చిత్రకళా శిక్షణ తరగతులను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కోశాధికారి గోపా సత్యనారాయణ మాట్లాడుతూ విద్యార్థులకు మూడు విభాగాల్లో చిత్రకళ పోటీలు నిర్వహించి, ఒక్కొక్క విభాగంలో 8 మంది చొప్పున బహుమతులు అందజేస్తున్నట్లు చెప్పారు. ఈ పోటీల్లో నీలిమ, ఎస్‌కే బీబీజహర, కె.పూజిత, పి.వీరేంద్ర, కె.లక్ష్మీవసుధ, కె.హేమదీపిక, కె.రాజేష్, ఎం.ఉజ్వల, పి సాయిశరిత ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో బహుమతులు గెల్చుకున్నారు. పరిమి రామకృష్ణ, పొన్నా రంగారావు, భాను పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు ఆటంకం

భీమవరం అర్బన్: పట్టణంలోని ఏఎస్ఆర్ నగర్‌లోని 33/11 కేవీ ఇండోర్ విద్యుత్ ఉపకేంద్రం పరిధిలో 11 కేవీ విద్యుత్ లైన్లపై చెట్లు, కొమ్మలు తొలగించే నిమిత్తం సోమవారం పలు గ్రామాలలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్ శాఖ ఈఈ పీర్ అహ్మద్‌ఖాన్ ఆదివారం తెలిపారు. రాయలం గ్రామంలోని కొన్ని ప్రాంతాలు, చినఅమిరం గ్రామంలో సోమవారం ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని తెలిపారు.

కొనసాగిన గణేష్ నిమజ్జనాలు



ఆకివీడులో నిమజ్జనానికి తరలుతున్న వినాయకుడు



లడ్డు ప్రసాదంతో భక్తుడు, క్షత్రియ యూత్ సభ్యులు



స్వామివారికి గరికపూజ నిర్వహిస్తున్న మహిళలు

ఆకివీడు: వినాయక చవితి ఉత్సవాల సందడి ఆదివారం కూడా పలు పందిళ్లలో కొనసాగింది. గణనాథుడికి ప్రత్యేక పూజలు చేశారు. స్థానిక శాంతినగర్‌లోని వరసిద్ధి వినాయక ఆలయంలో గణనాథుడిని ధననాథుడుగా అలంకరించి ప్రత్యేకపూజలు చేశారు. హోమాలు నిర్వహించారు. రాజరాజేశ్వరి సహిత మార్కండేయేశ్వరస్వామి ఆలయంలో లంబోధరుడికి ఉండ్రాళ్లు సమర్పించి, ప్రత్యేక పూజలు చేశారు. స్థానిక అగ్నికుల క్షత్రియ యువజన సంఘం ఆధ్వర్యంలో బాలలు, యువజన సభ్యులు ఊరేగింపులో పాల్గొన్నారు. పలుచోట్ల గణేష్ విగ్రహాల్ని గ్రామాల్లో ఊరేగించారు. అనంతరం నిమజ్జనం చేశారు.

రూ.50 వేలు పలికిన లడ్డూ ప్రసాదం

కాళ్ల: గణపతి నవరాత్రుల మహోత్సవాల్లో భాగంగా స్వామి వారి లడ్డూ ప్రసాదాన్ని వేలం పాటలో రూ.50 వేలకు ఓ భక్తుడు దక్కించుకున్నాడు. పెదఅమిరం గ్రామంలో క్షత్రియ యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయక మండపం వద్ద లడ్డూ ప్రసాదం వేలం పాటను ఆదివారం నిర్వహించారు. ఈ వేలం పాటలో యూత్ సభ్యులు గొట్టుముక్కల రామకృష్ణంరాజు, కఠారి వెంకటనరసింహారాజు, కోపల్లె సొసైటీ అధ్యక్షుడు వేగేశ్న జయరామకృష్ణంరాజు, ముదుండి అశ్వినికృష్ణంరాజు, వేగేశ్న సతీష్, ముదుండి సోమరాజు, వేగేశ్న శ్రీనివాసరాజు, దండు కృష్ణంరాజు, ముదుండి రామకృష్ణంరాజు, గొట్టుముక్కల కృష్ణంరాజు కలిసి 10 కేజీల లడ్డూ ప్రసాదాన్ని రూ.50 వేలకు దక్కించుకున్నారు. అదేవిధంగా మండలంలోని పలు గ్రామాల్లో ఏర్పాటు చేసిన మండపంలో గణనాథుడుని మేళతాళాలతో ఊరేగింపు నిర్వహించి నిమజ్జనం చేశారు. ఆయా కార్యక్రమాల్లో గ్రామ పెద్దలు, కమిటీ నిర్వాహకులు, మహిళలు పాల్గొన్నారు.

విజయ గణపతికి లక్ష గరిక పూజ

భీమవరం (ప్రకాశంచౌక్): మెంటేవారి తోటలోని శ్రీబాలత్రిపుర సుందరిదేవి అమ్మవారి దేవాలయంలోని విజయ గణపతి స్వామివారికి లక్ష గరిక పూజ నిర్వహించారు. అర్చకులు కొమ్ము శ్రీనివాస్, ఈమని పవన్ కుమార్ అధ్వర్యంలో స్వామివారికి పెరుమాళ్ల కృష్ణ మహావీర్, హారిక లక్ష్మి దంపతులతో గణపతి పూజ, అభిషేకాలు, గరిక పూజ, నవగ్రహ పూజ, లక్ష్మీ గణపతి హోమం, పూర్ణాహుతి కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో మహిళలతో సంప్రదాయ బద్ధంగా సామూహికంగా లక్ష గరిక పూజ నిర్వహించారు. స్వామివారికి ప్రత్యేక అలంకరణ చేశారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు.

దిరుసుమర్రులో అన్నసమారాధన

భీమవరం అర్బన్: దిరుసుమర్రులో శ్రీ వినాయక చవితి ఉత్సవాలలో భాగంగా ఆదివారం అఖండ అన్నసమారాధన నిర్వహించారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన సర్పంచ్ కోళ్ల బాలకృష్ణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. వివిధ వంటకాలతో సుమారు 4 వేల మందికి స్వామివారి ప్రసాదాన్ని అందించారు. అఖరి రోజు కావడంతో శ్రీ వినాయక స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. భక్తులకు ఏర్పాట్లను ఉత్సవ కమిటీ సభ్యులు పర్యవేక్షించారు.